# అద్భుత దీపం

అర్ధరాత్రి దాటినా రంగడికి నిద్ర పట్టలేదు.

ఆ ఊరికంతా అదే పెద్దమేడ. ఆ మేడ ప్రక్కన వున్న చిన్నపాకలో వుంటున్న కూలివాడి కొడుకే రంగడు. వాడికి పదేళ్ళుంటాయి. వాడు, తమ్ముడు, చెల్లాయి, అమ్మ, నాన్న - ఐదు మంది వున్నారు ఆ కుటుంబంలో. వాళ్ళకు తగినంత తిండిలేదు. చాలినన్ని గుడ్డల్లేవు. ఎప్పుడూ ఏదో కొరతలే! రంగడు వీటిని గురించి ఆలోచిస్తూ వుంటాడు కాబట్టి, రాత్రిపూట వాడికి తొందరగా నిద్రపట్టదు.

... ఇంటి వెనక నుంచి ఇనపరేకును లాగినట్లు బరబరమంటూ ఏదో చిన్న చప్పుడు వినిపిస్తూనే వుంది. ఏదోలే అనుకున్నాడు వాడు. కానీ ఎంతసేపటికీ ఆ చప్పుడు ఆగలేదు. వాడికి విసుగు వేసింది. ఏ ఎలుకో, పందికొక్కో అయివుంటుందని లేచి వెళ్ళి తలుపు తీశాడు. తెల్లటి వెన్నెల ఇంట్లోకి విరుచుకు పడింది. రంగడు యింటి వెనక్కి నడిచాడు. ఇంటి వెనక గోడ క్రింది కంతలోకి ఏదో వస్తువును లాగుతున్న ఎలిక చెంగున గెంతిపారిపోయింది. బొరియలో వున్న వస్తువేమిటో చూద్దామని దాన్ని చేతికందుకున్నాడు రంగడు. అదొక చిన్న ఓటి దీపం. చాలా పాతది. అంత అందమైన దీపాన్ని వాడెప్పుడూ చూడలేదు. అది మట్టిగొట్టుకున్నందున దాన్ని చేతితో తుడిచాడు వాడు.

వెంటనే ఆ దీపంలోంచి ఆకాశమంత ఎత్తుకు తెల్లటిపొగలేచింది. రంగడు కొయ్యబారిపోయాడు. మరుక్షణంలోనే పొగ అణగారిపోయింది. విచిత్రంగా వున్న ఒక పెద్దభూతం వాడి ఎదుట చేతులు కట్టుకుని నిలబడింది. "సర్కార్! ఏమి ఆజ్ఞ?" అంది వినయంగా. రంగడు భయపడిపోయాడు. వాడికి నోట మాట రాలేదు. "చెప్పండి సర్కార్! ఏమి ఆజ్ఞ?" అంది భూతం మళ్ళీ.

రంగడు ధైర్యం తెచ్చుకున్నాడు. "ఎవర్నువ్వు?" అని అడిగాడు.

"నేనిప్పుడు నిద్రలేచాను. ఎన్నేండ్లుగా నిద్రపోతున్నానో నాకే తెలియదు. ఇప్పుడు నిద్రలేచేసరికి ప్రపంచమంతా చిత్రంగా మారిపోయింది. ఇప్పుడు ఆ మనుషులూ లేరు, ఆ రాజ్యాలూ లేవు. అల్లాఉద్దీన్ అద్భుత దీపం కథ వినలేదూ నువ్వు? నీ చేతిలో వున్నదే ఆ అద్భుత దీపం. ఆ భూతాన్ని నేనే! ఈ దీపం ఎవరిచేతిలో వుంటే నేను వాళ్ళ గులామును! వాళ్ళు చెప్పిన పనుల్ని చిటికెలో చేసేస్తాను. ఇంతకాలమూ ఈ దీపం మట్టిలో కూరుకుపోయింది గనుక నాతో ఎవరికీ ఏపనీ లేకపోయింది." అని చెప్పింది భూతం.

రంగడికి సంతోషం వేసింది. "అయితే నేను ఏమిచెప్పినా, నువ్వుచేస్తావా?" అని అడిగాడు ఆశగా.

"ఓ! అయితే నేను చాలా ముసలివాణ్ణి అయిపోయాను కదా! నాశక్తి అంతా అయిపోయింది. ఇంతవరకూ ఎన్నిసార్లు ఎన్నెన్ని పనులు చేశానో లెక్కేలేదు. ఇక మూడుసార్లు మాత్రమే పనులు చెయ్యగలను. ఆ తరువాత అసలు వుండనే వుండను.... చెప్పండి సర్కార్! ఏమి ఆజ్ఞ?" అంది భూతం.

రంగడు క్షణకాలం ఆలోచించాడు. "అయితే, ఇప్పుడీ పనిచెయ్యి. ఆ మేడను చూశావా? అందులో వుంటున్న వాళ్లంతా సుఖంగా వుంటున్నారు. ఈ వూళ్లో అందరి ఇళ్ళూ అలాంటి మేడలే అయిపోవాలి. ఆ మేడలో ఏఏ వస్తువులైతే వున్నాయో, అలాంటి వస్తువులన్నీ అందరి ఇళ్ళలోనూ వుండాలి." అన్నాడు.

"సరే" అంటూ భూతం చెయ్యి పైకెత్తి చుట్టూ తిప్పింది. వెంటనే పాక మాయమైపోయింది. ఆ చోట్లో పెద్దమేడ పైకిలేచింది. అదొక్కటే కాదు, ఊరినిండా అన్నీ అలాంటి మేడలే! రంగడు తన కళ్ళను నమ్మలేకపోయాడు. "ఇక సెలవా సర్కార్? అవసరమైతే మళ్ళీ పిలవండి, వస్తాను!" అని మాయమైపోయింది భూతం.

ఊరంతా నిద్రపోతూనే వుంది. రంగడు తన మేడలోకి నడిచాడు. అందులో పెద్దపెద్ద గదులు ఎన్నో వున్నాయి. అమ్మ, నాన్న, తమ్ముడు చెల్లాయి - మంచాల మీద మెత్తటి పరుపుల మీద దోమతెరల్లో నిద్రపోతున్నారు. వాళ్లంతా మంచిమంచి దుస్తుల్లో వున్నారు. జరిగిన మార్పేమీ వాళ్ళకు తెలియనే తెలియదు. వాళ్ళను లేపుదామనిపించింది రగడికి. అయితే, హాయిగా నిద్రపోతున్న వాళ్ళముఖాలు చూస్తుంటే లేపడానికి బుద్ధిపుట్టలేదు. వాళ్ళు ఉదయం కళ్ళు తెరిచి, ఆశ్చర్య పోవడమే బాగుంటుందనుకున్నాడు.

ఇల్లంతా కలయదిరిగాడు రంగడు. రేడియో, ఫ్యాన్లు, బీరువాలు, పెట్టెలు వాటినిండా నగలు, నాణేలు, విలువైన దుస్తులు, వంటగది నిండా బియ్యం, పప్పులు, నూనెలు... ఏవేవి కావాలో అన్నీ వున్నాయి. తెల్లవారితే, అమ్మకు చేతినిండా పని.

వాడు మేడమెట్లెక్కి పైకివెళ్ళాడు. మేడపై గదిలో కాసేపు నిలబడ్డాడు. స్విచ్ ఎక్కడుందో గుర్తుపట్టి లైటు వేశాడు. గదినిండా కరెంటు వెలుతురు! లైటు మళ్ళీ మళ్ళీ వేస్తూ, ఆర్పుతూ కొన్ని క్షణాలు గడిపాడు. పక్కవాళ్ళ మేడకు, తన మేడకు మధ్యలో కిటికీ ఉంది. వెళ్ళి ఆ కిటికీ తెరిచాడు. అవతల మంచంమీద తన నేస్తం సంజీవి నిద్రపోతూ కనిపించాడు.

తానూ, సంజీవీ ఒకే తరగతిలో చదువుకుంటున్నారు. తన జిడ్డుముఖాన్ని చింకి గుడ్డల్నీ చూసి సంజీవి ఎప్పుడూ వేళాకోళం చేస్తుంటాడు. తాయిలాలు తింటూ తనని వెక్కిరిస్తుంటాడు. ఇప్పుడు తనని చూస్తే ఆశ్చర్యపోడూ?

"సంజీవీ! సంజీవీ!" అని మెల్లగా పిలిచాడు రంగడు. మళ్ళీమళ్ళీ పిలిచాడు. సంజీవికి మెలకువొచ్చింది. లేచి కిటికీ దగ్గరకు వచ్చాడు. "సంజీవీ! నా బట్టలు చూశావా? ఎలా వున్నాయో?" అన్నాడు రంగడు.

"ఇక్కడికెలా వొచ్చావు? కిటికీ చువ్వలు పట్టుకు వేలాడుతున్నావా? కింద పడిపోవూ? అన్నాడు సంజీవి.

"ఎందుకు పడిపోతానూ? నేను మేడ పైన వున్నాను కదా! ఈ మేడ మాది!" అన్నాడు రంగడు ఠీవిగా.

"అరె! ఎలా వొచ్చింది మేడ? ఆశ్చర్యంగా వుందే!" అన్నాడు సంజీవి, కళ్ళు పెద్దవి చేసి.

"అల్లావుద్దీన్ అద్భుత దీపం దొరికింది నాకు. రుద్దితే భూతం వచ్చి చెప్పినపని చేస్తుంది. ఇంక రెండుసార్లు మాత్రమే చేస్తుంది". అంటూ తన దగ్గిరున్న దీపాన్ని చూపించాడు రంగడు.

సంజీవి వాళ్ళ నాన్న పేరు పేర్రాజు. ఆ రోజున అతను ఇంట్లోలేడు. కారులో పొరుగూరు వెళ్ళాడు. రాత్రి ఒంటిగంటకు తిరిగి వచ్చాడు. ఊరి పొలిమేరల్లో వస్తూంటే, ఇది తన ఊరు కాదేమో అనిపించింది. అన్నీ తనమేడలాంటి మేడలే! పాకలూ, పెంకుటిళ్లూ లేవు. వీధి అరుగుల మీద పడుకుని గుర్రు పెడుతున్న ముష్టివాళ్ళు కూడా పట్టు పీతాంబరాలు కట్టుకుని వున్నారు. వాళ్ళ బెర్లిన్ జోలెల్లోంచి వెండికంచాలు తొంగిచూస్తున్నాయి. తన యింటిని గుర్తుపట్టడం

చాలా కష్టమై పోయిందతనికి. ఆఖరికి ఎలాగో తన ఇల్లు చేరుకున్నాడు. పోర్టికోలో కారు నిలిపి, మేడపైకి దయ్యంలా నడిచి వెళ్ళాడు. సంజీవి మంచంమీద కూర్చుని కిటికీ వైపు గుడ్లప్పగించి చూస్తున్నాడు.

"ఇది కలా, నిజమా?" అన్నాడు పేర్రాజు.

"ఏమిటి నాన్నా" అన్నాడు సంజీవి.

"అదే! ఊరినిండా మేడలు! ఊరే మారిపోయింది..... ఇది కలా, నిజమా?" అంటూ పేర్రాజు గొణిగాడు.

"కలకాదు నాన్నా! నిజమే!... కింద పాకలో లేడూ, రంగడు? వాడికి అల్లా వుద్దీన్ అద్భుత దీపం దొరికింది...." అంటూ సంగతంతా చెప్పాడు సంజీవి.

" ఆ దీపం యింకా వాడిచేతిలోనే వుంది. చూడు" అంటూ కిటికీకి అవతల మంచం మీద పడకుని నిద్రపోతున్న రంగణ్ణి చూపించాడు.

"బంగారం లాంటి ఊరు పాడైపోయింది. వీల్లేదు. ఊరు ఇలా మారిపోవటానికి వీల్లేదు. అందరూ పల్లకీ ఎక్కేవాళ్ళే అయితే, మోసేవాళ్ళెవరు? అందరూ సమానమే అయితే, తరవాత నామాట వింటారా? నేను చెప్పిన పనులు చేస్తారా? నాకు ఓట్లు వేస్తారా? నాకు జేజేలు కొడతారా? వీల్లేదు! ఈ అక్రమాన్ని అరికట్టాల్సిందే!" అంటూ పిడికిలి బిగించాడు పేర్రాజు.

కిటికీ దగ్గరికి వెళ్ళి "బాబూ! రంగన్నా!" అని ప్రేమగా పిలిచాడు.

రంగడు నిద్రమేలుకుని, "పిలిచారా?" అన్నాడు.

"ఔను బాబూ! నీదగ్గరేదో అద్భుత దీపం వుందటనే? ఒకమారు చూపిస్తావా నాయనా?" అన్నాడు పేర్రాజు చిరునవ్వుతో.

"ఇదిగో చూడండి!" అంటూ కిటికీ దగ్గరకు లేచివెళ్ళాడు రంగడు. కిటికీ ఊచల సందుల్లో దీపం పట్టలేదు.

"మంచి కుర్రాడివి!.... ఇందులో పట్టదుగానీ, కిందికి దిగిపోయి, మా యింట్లోంచి పైకిరా! నీకు సర్టిఫికేటు యిస్తాను. ప్రభుత్వానికి సిఫార్సుచేసి గోల్డ్ మెడల్ కూడా యిప్పిస్తాన్లే!" అన్నాడు పేర్రాజు.

రంగడు కిందికి దిగివెళ్ళి, పేర్రాజు యింట్లో నుంచి పైకి వెళ్ళాడు. 'ఇలాతే!' అంటూ ఎగిరి దీపాన్ని అందుకున్నాడు పేర్రాజు. చేతితో రుద్దగానే భూతం ప్రత్యక్షమైంది. "సర్కార్! ఏమి ఆజ్ఞ?" అంటూ చేతులు మోడ్చింది.

"నువ్వేనా బాబూ ఆ భూతానివి? ఇక రెండుసార్లేనా నువ్వు పనులు చేసేది?" అన్నాడు పేర్రాజు.

భూతం రంగడివైపు జాలిగా చూసింది. ఆ దీపం పేర్రాజు చేతికి పోవడం దానికి యిష్టం లేదు. అందుకే అది అబద్ధం చెప్పటానికి జంకలేదు. "ఔను సర్కార్! రెండుసార్లే! ఒకసారి చేసేశాను గనుక యింకొక్కసారి మాత్రమే మిగిలుంది!"

"అయితే విను! నీచేత కొత్తగా తయారైన మేడలన్నీ మాయమై పోవాలి. మధ్యలో వచ్చిన సంపదలన్నీ మళ్ళీ పోయి, ఊరు వెనుకటిలాగా మారిపోవాలి." అన్నాడు పేర్రాజు.

భూతం చెయ్యి పైకెత్తి చుట్టూ ఒక సారి తిప్పింది. మధ్యలో లేచిన మేడలన్నీ మాయమైపోయాయి. రంగడి ఒంటి మీదికి మళ్ళీ చింకిబట్టలొచ్చేశాయి.

"నా దీపం! నా దీపం!" అంటూ పేర్రాజు మీదికి ఎగబడ్డాడు రంగడు. పేర్రాజు బిగ్గరగా నవ్వుతూ బాల్కనీలోకి వెళ్ళి బలం కొద్దీ దీపాన్ని విసిరి పారేశాడు.

రంగడు గబగబా కిందికి దిగివెళ్లాడు. పాకలో తనవాళ్ళంతా నిద్రపోతున్నారు. దీపంకోసం వాడు ఆ పరిసరాలంతా వెతికాడు. అది ఎక్కడా కనిపించలేదు. మరునాడు ఊరంతా గాలించాడు. ఊరి చుట్టూ తిరిగాడు. దీపం దొరకలేదు. భూతం యింకొక్కసారి మాత్రమే వస్తుంది. అయితే ఆ అద్భుత దీపం దొరకాలి కదా?... అదెప్పుడు దొరుకుతుందో! ■

✪ తిరుపతి శోభ వార పత్రిక 28-5-1976 ✪

• విజేత మాసపత్రిక నవంబరు 1977 •